ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 15 మార్చి 2025



నేడు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర: కలెక్టర్

పార్వతీపురం,మర్చి14(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 451 పంచాయతీల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యదర్శులు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. స్వచ్ఛతపై పల్లెవాసులను చైతన్యపర్చాలని, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను తెలియజేయాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలన్నారు.

మంచు టెండ

- 'మన్యం'లో విచిత్ర వాతావరణ పరిస్థితులు
- ఉదయం పొగ మంచు.. మధ్యాహ్నం ఠారెత్తిస్తున్న ఎండ
- కొన్నిచోట్ల వడగాడ్పుల ప్రభావం
- వేసవి ప్రారంభంలోనే ప్రజలు ఉక్కిరిబిక్కిరి



శుక్రవారం ఉదయం ఏడు గంటల సమయంలో గొట్టివలసలో పొగమంచు ఇలా..

పాలకొండ/గరుగుబిల్లి/సీతంపేట రూరల్/సాలూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయాయి. మార్చి మొదటివారం నుంచే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం ఏడు గంటల వరకు చాలాచోట్ల పొగమంచు కురుస్తుండగా.. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోతోంది. ఎనిమిది గంట తర్వాత నుంచి భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. దీంతో జిల్లావాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ వేడిని తట్టుకోలేక చాలామంది ఉదయం 11 గంటల తర్వాత ఇళ్లు కదలడం లేదు. దీంతో జిల్లాలో ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్లు సాయంత్రం నాలుగు గంటల వరకు బోసిపోతున్నాయి.

ఇప్పటికే జిల్లాలోని వివిధ మండలాల్లో వడగాడ్పుల ప్రభావం కనిపిస్తోంది. 38 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాలూరు ఏజెన్సీలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు కురిసింది. ఆ తర్వాత ఎండ ధాటికి జనం ఇబ్బంది పడ్డారు. మొత్తంగా 39 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదైంది. సీతంపేట, గరుగుబిల్లి మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా వాతావరణ విచిత్ర పరిస్థితులతో అనేక మంది రోగాల బారిన పడుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గుతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యధికులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఏదేమైనా ఈ ఏడాది వేసవి తీవ్రత అధికంగా ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



సీతంపేటలో..



మధ్యాహ్నం 12 గంటల సమయంలో నిర్మానుష్యంగా నాగూరు ప్రధాన మార్గం

బెడ్లు 150 రోగులు 249

- ఇదీ జిల్లాకేంద్రాసుపత్రిలో పరిస్థితి..
- అప్‌గ్రేడ్ అయి మూడేళ్లు.. మెరుగుపడని సౌకర్యాలు
- వేధిస్తున్న వైద్య నిపుణులు, సిబ్బంది కొరత
- రోగులకు తప్పని ఇబ్బందులు



జిల్లా కేంద్రాసుపత్రిలో రోగులు ఇలా..

ఆంధ్రజ్యోతి విజిట్

బెలగాం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పేరుకే పెద్దాసుపత్రి.. కానీ అక్కడకు వచ్చే రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిగా అప్‌గ్రేడ్ అయి మూడేళ్లు గడు స్తున్నా.. పరిస్థితి ఏ మాత్రం మారలేదు. కొన్ని విభాగాల్లో వైద్య నిపుణుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రధానంగా ఇక్కడ ఓపీ నమోదు రోగుల సహనానికి పరీక్ష పెడుతోంది. ఆసుపత్రిలో మౌలిక వసతులు లేకపోవడంతో రోగుల బంధువులు, సహాయకులు ఆరుబయటే నిరీక్షించాల్సి వస్తోంది. కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యంపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం ఉదయం పదకొండు గంటలకు ఆసుపత్రిని సందర్శించగా అప్పటికే వైద్యులంతా హాజరయ్యారు. ఇక్కడ 150 బెడ్లు ఉండగా 249 మంది ఇన్‌పేషంట్లుగా ఉన్నారు. ఓపీ సుమారు 350 వరకూ నమోదైంది. కాగా ఆసుపత్రిలో తల సేమియా డే కేర్ సెంటర్ వార్డుకు తాళం వేసి ఉంది. ఐసోలేషన్ వార్డులో మరుగుదొడ్లు వినియోగంలో లేవు. బయట ఉన్న మరుగుదొడ్లను రోగులు వినియోగించుకోవాలని ఆసుపత్రి సిబ్బంది సూచించినట్లు తెలిసింది. ఐసోలేషన్ వార్డులో బెడ్లు అధ్వానంగా ఉన్నాయి. సికిల్ సెల్ అనీమియా బాధితులు రక్తం కోసం ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు కనపడ్డాయి. ఆసుపత్రి రీమోడలింగ్ కోసం తెచ్చిన టైల్స్ మూలన పడి ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన పనులు ఇంకా పూర్తి కాలేదు.

ఓపీ కష్టాలు

జిల్లా కేంద్రాసుపత్రికి రోజూ ఓపీ కోసం అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. అయితే కచ్చితంగా వారికి ఆధార్ లింక్ ఉన్న ఫోన్ నెంబర్, ఆధార్ ఉంటేనే ఆసుపత్రిలో ఓపీ నమోదు అవుతుంది. అయితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారిలో కొందరికి ఫోన్ ఉండడం లేదు. మరికొంతమందికి ఆధార్ లేకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. మరోవైపు ఓపీ నమోదుకు దాదాపు 7-10 నిమిషాలు పడుతుండడంతో ఆ ప్రాంగణం రద్దీగా మారుతోంది.

ఇవీ సమస్యలు..

- ఆసుపత్రి ఆవరణలో రోగుల బంధువులు, సహాయకులు కూర్చోవడానికి బెంచీలు, కుర్చీలు లేవు. దీంతో వారు గేట్ బయట, చెట్ల కింద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.
- శానిటేషన్ అంతంత మాత్రంగానే ఉంది. రోగులు, రోగుల బంధులపై సెక్యూరిటీ సిబ్బంది సరైన రీతిలో స్పందించడం లేదని ఆరోపణలున్నాయి.
- రక్త నిధి ఉన్నప్పటికీ డోనర్ తీసుకొస్తేనే రక్తం ఇస్తామని సిబ్బంది చెబుతున్నట్లు రోగులు వాపోతున్నారు.

(మిగతా 8వ పేజీలో...)



ఓపీ దగ్గర రద్దీ

నేటి నుంచి ఒంటిపూట బడులు



గరుగుబిల్లి/సాలూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎండల నేపథ్యంలో జిల్లాలో శనివారం నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని పాఠశాల ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా యంత్రాంగానికి ఉత్తర్వులు అందాయి. జిల్లాలో ఉన్న 1,789 ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలను ఉదయం 7.45 గం టల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం 8.40 గంటల నుంచి 8.45 వరకు వాటర్ బెల్ నిర్వహించనున్నారు. మంగళ,గురు, శని వారాల్లో రాగిజావకు ఉదయం 10.05 గంటలకు విరామం ఇవ్వనున్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం పాఠశాలలను విడిచి పెట్టనున్నారు. పదో తరగతి పరీక్షలు జరిగే కేంద్రాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంగల వరకు తరగతులు నిర్వహించనున్నారు. కాగా ఒంటిపూట బడుల నేపథ్యంలో వేసవి తాపానికి విద్యార్థులు గురికాకుండా ఉండేందుకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులు సూచించారు. ఎండీఎం, దాతల సహకారంతో మజ్జిగ అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని ఆదేశాలు అందాయని, దీనిపై పాఠశాలల హెచ్ఎంలకు సమాచారం అందించామని గరుగుబిల్లి ఎంఈవో దత్తి అప్పలనాయుడు తెలిపారు.

మాస్టారూ.. మా మనసును గెలిచారు

- పిల్లల ప్రవర్తనలో తల్లిదండ్రుల పాత్ర కీలకం
- విద్యార్థుల చదువులపై దృష్టి పెట్టాలి
- టీచర్ల మాటకు విలువనిచ్చేలా చూడాలి
- పెంట జడ్పీ స్కూల్ హెచ్ఎంపై ప్రశంసల వర్షం

6లో

పింఛన్ రూ.4వేలకు పెంచిన ఘనత బాబుదే

- మంత్రి సంధ్యారాణి

8లో

ఏటీఎం కార్డుల క్లోనింగ్

- పాలకొండలో ఇద్దరు అరెస్టు

7లో

కనుల పండువగా..

- విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

సాలూరు రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మామిడిపల్లిలో విజయదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామంలో అమ్మవారి విగ్రహంతో తిరువీధి నిర్వహించారు. మహిళలు ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్లారు. ఆలయ ప్రాంగణంలో విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వాచనం, దీక్షా సంకల్పం, రక్షా బంధనం, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం జలధివాసం, క్షీరాధివాసం, ధాన్యధివాసం, 16న అమ్మవారి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పూర్ణకలశ, చండీ హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ముర్రాటలతో అమ్మవారి ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఆపద వేళ.. 'శక్తి'నిచ్చేలా!

- మహిళలకు రక్షణకు పటిష్ఠ చర్యలు
- సులభ పద్ధతిలో ఫిర్యాదుకు కొత్త యాప్
- జిల్లాలో మూడు శక్తి బృందాల ఏర్పాటు
- ఇప్పటికే ఉమెన్ హెల్ప్‌డెస్క్, డ్రాప్‌బాక్స్‌లు
- ఎస్పీ పర్యవేక్షణలో సమస్యలకు పరిష్కారం

పార్వతీపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు ప్రాధాన్యమిచ్చే దిశగా పోలీసు శాఖ పటిష్ఠ చర్యలు చేపడుతోంది. విద్య, ఉద్యోగం, ఉపాధి, ఇతర పనుల కోసం బయటకు వెళ్లే మహిళలు తమ ఇళ్లకు సురక్షితంగా చేరుకునేలా శక్తి యాప్‌ను రూపొందించింది. ఫిర్యాదుల పద్ధతిని సులభతరం చేసి.. మహిళలకు రక్షణ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇకపై ప్రతీ మహిళా ఓ శక్తిగా మారేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో ఈ యాప్‌ను సిద్ధం చేసింది. మహిళలు ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. ఎటువంటి ఆపద వచ్చినా దీనిద్వారా పోలీసులకు సమాచారం అందిస్తే చాలు.. తక్షణమే వారు అక్కడకు చేరుకుని రక్షణ కల్పిస్తారు. జిల్లాలోని ప్రతీ ఆటో, దాని డ్రైవర్ వివరాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఓ యాప్‌లో పొందుపరచనున్నారు. దీనికి సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను ఆటోలో ముద్రిస్తారు. మహిళలు ఆటోలో ప్రయాణించే సందర్భంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే.. శక్తి యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే.. ఆ ఆటో ఎక్కడికి వెళ్తుంది.. ఎవరు నడుపుతున్నారనే పూర్తి సమాచారం తెలుస్తుంది. ఆ సమాచారాన్ని శక్తి యాప్ ద్వారా తల్లిదండ్రులతోపాటు పోలీసులకు పంపించవచ్చు. తద్వారా మహిళలకు పోలీసు శాఖ భద్రత కల్పించనుంది. అలాగే వేధింపులు, ర్యాగింగ్‌లు తదితర వాటిపైనా నేరుగా ఈ యాప్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు. జిల్లాలోని మూడు శక్తి బృందాలను సిద్ధం చేశారు.



జెండా ఊపి శక్తి వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ

ఇప్పటికే ప్రతీస్టేషన్‌లో ఉమెన్ హెల్ప్‌డెస్క్‌లు

జిల్లాలో ఉన్న 36 పోలీసుస్టేషన్లలో త్వరలో ఉమెన్ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఓ మహిళా కానిస్టేబుల్ కేవలం మహిళ బాధితుల నుంచి మాత్రమే ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఆ వివరాలను ఎస్‌హెచ్ఓలకు వివరించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తారు. దీంతో మహిళలు

(మిగతా 8వ పేజీలో...)


సభ వద్ద నాగబాబు భార్య


సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్

పవన్ అభిమానం


మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.


పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.


చిత్రాడదారులన్నీ జనపవనమై..

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

మాస్టారూ.. మా మనసును గెలిచారు


హెచ్‌ఎం రమణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

తాము ఎంత ప్రయత్నించినా పిల్లలు సరిగా చదవడం లేదని.. వారి ప్రవర్తనలో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ విజయనగరం జిల్లాలోని ఓ ఉపాధ్యాయుడు ఇటీవల గుంజీలు తీసి.. సాష్టాంగ నమస్కారం చేసి.. తనకు తానే శిక్ష విధించుకున్న సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన ప్రస్తుత సమాజంలోని పరిస్థితులకు దర్పణంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో పిల్లల ప్రవర్తన విషయంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల అంశం మరోసారి తెరపైకి వస్తోంది. చదివించే బాధ్యత ఉపాధ్యాయులదే అయినా... వారు చదువుపై ఆసక్తి చూపడంలో కీలక పాత్ర పోషించేది తల్లిదండ్రులదేనని నిపుణులు చెబుతున్నారు.

బొబ్బిలి, మార్చి 14(ఆంధ్రజ్యోతి):

బొబ్బిలి మండలం పెంట జెడ్పీ హైస్కూలులో విద్యార్థులతో క్రమశిక్షణ కొరవడుతోందని.. విద్యా ప్రమాణాలు కుంటుపడుతున్నాయని కలత చెందిన ప్రధానోపాధ్యాయుడు చింతా రమణ విద్యార్థులందరికీ ప్రార్థన సమయంలో సాష్టాంగ నమస్కారం చేసి... గుంజీలు తీసిన సంఘటన అటు ప్రభుత్వాన్ని... ఇటు మేధావులను... తల్లిదండ్రులను... విద్యార్థులను ఆలోచింపజేసేలా చేసింది. ఇది మార్పునకు నాంది పలకాలని అందరూ కోరుకుంటున్నారు. తల్లిదండ్రుల బాధ్యతను గుర్తు చేస్తున్నారు.

- ఇటీవల ఒక పాఠశాలలో పదో తరగతి చదివే కొందరు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు రోజూ హోంవర్కు ఇచ్చేవారు. హోం వర్కు చేయని విద్యార్థులకు మంచి మాటలు చెప్పినా.. తీరు మారలేదు. దీంతో తల్లిదండ్రుల దృష్టికి విషయం తీసుకెళ్లారు. కానీ వారిలో మార్పు రాలేదు. ఇటీవల ఆ ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా... ఇద్దరు పదో తరగతి విద్యార్థులు ద్విచక్ర వాహనంపై వెళ్లి... ఆ ఉపాధ్యాయుడిని చుట్టుముట్టి... హీరోయిజం చూపించారు. దీనికి కారణం తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపమని నిపుణుల ఆందోళన.
- ఒక గ్రామంలో రెండేళ్ల క్రితం ఎనిమిదో తరగతి చదివే విద్యార్థికి 99 తరువాత వచ్చే అంకె ఏమిటని అడిగితే... ముందా.. వెనుకా? అని ఆ విద్యార్థి ప్రశ్నించాడు. తరువాత అని చెబితే.. 99 తరువాత ..78 అని చెప్పాడు. దీనికి కారణం ప్రాథమిక దశలోనే తల్లిదండ్రులు శ్రద్ధ చూపకపోవడమేనని నిపుణులు అంటున్నారు.
- కొన్ని పాఠశాలల్లో చదివే కొందరు విద్యార్థులైతే పాఠశాలల పేరుతో ఇంటి నుంచి బయలుదేరి... పాఠశాలకు వెళ్లక.. ఇంటికి చేరక .. రోడ్ల మీద కనిపిస్తున్నారు. ఆ పిల్లలు స్కూలుకు వెళుతున్నారో... లేదో తెలుసుకోవడానికి తల్లిదండ్రులు కనీస ప్రయత్నం చేయడం లేదు. ఇది విద్యార్థులు అదుపు తప్పడానికి దారి తీస్తోంది.

పెంపకంలో పెద్దల తప్పులు..

చిన్నపిల్లల్లో క్రమశిక్షణ ఎందుకు లోపిస్తోంది? దీనికి ఎవరు బాధ్యులు? బాగా చదువుకొని... మంచి ఉద్యోగాలు చేసుకునే తల్లిదండ్రులు కూడా పిల్లల క్రమశిక్షణ విషయంలో ఎందుకు విఫలమవుతున్నారు? అనే విషయాలను లోతుగా పరిశీలిస్తే...

- క్రమశిక్షణపై సరైన అవగాహన లేకపోవడం, పిల్లల శక్తిని, వయసును తప్పుగా అంచనా వేయడం.
- తిట్టడం, కొట్టడం, అరవడం అనేవి క్రమశిక్షణ కాదు. ఇలాంటి చర్యలు పిల్లల్లో తల్లిదండ్రుల పట్ల వ్యతిరేక భావం కలిగిస్తాయి. ఏం చెయ్యాలో... ఎలా చెయ్యాలో చెప్పడమే క్రమశిక్షణ. అది కూడా పిల్లల మనసుకు హత్తుకునేలా... నెమ్మదిగా చెప్పాలి. ఇతరుల మనోభావాలను గౌరవించడం, ఎవరి మనసూ నొప్పించకుండా ప్రవర్తించడం అలవాటు చేయాలి. ఇవేవీ చేయకుండా ఫలానా పని సరిగా చెయ్యలేదని పిల్లలను నిందించడంలో అర్థం లేదని పెద్దలు గుర్తించాలి.
- పిల్లలతో ఎక్కువ సమయం తల్లిదండ్రులు గడపకపోవడం. వారితో సరిగా మాట్లడకపోవడం వల్ల తల్లిదండ్రుల పట్ల వ్యతిరేకత ఏర్పడుతుంది. పాఠశాల నుంచి వచ్చిన తరువాత తల్లిదండ్రులు కొంత సమయం పిల్లలతో గడపాలి. ఆ తరువాత దగ్గర ఉంటూ హోంవర్కు చేయించాలి. ఇలా చేయడం ద్వారా పిల్లలకు తమ తల్లిదండ్రుల పట్ల గౌరవం పెరగడంతో పాటు చదువు పట్ల బాధ్యత పెరుగుతుంది.
- ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు హంవర్కు చేయాలని లేదా చదవాలని చెబుతూ వారి ముంగిటే సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తున్నారు. ఇలా చదివించే సమయంలో ఫోన్లు ముట్టుకోకుండా వీలైనంత వరకు ఫ్లైట్ మోడ్‌లో పెట్టుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు.
- ప్రస్తుత కాలంలో చాలా మంది భార్యాభర్తల మధ్య సఖ్యత కొరవడుతోంది. ఎడమొహం..పెడమొహంగా ఉండడం... సరదాగా మాట్లాడుకోకపోవడం వంటివి పిల్లల మనసుపై ప్రభావం చూపిస్తాయి. పిల్లల్లో మమతానురాగాలు పెరగవు. కాబట్టి వారి ముందు గొడవ పడకూడదు. ఇంట్లో అందరూ కలిసి సరదాగా గడపడానికి ప్రతిరోజా కొంత సమయం కేటాయించాలి. ఇలా చేస్తే తల్లిదండ్రులు చెప్పిన ప్రతి పనినీ పిల్లలు చిటికెలో చేస్తారు. క్రమశిక్షణ పెరుగుతుంది. పెద్దలు, గురువులు చెప్పిన మాటలు వింటారని నిపుణులు చెబుతున్నారు.
- కొందరు తల్లిదండ్రులు పిల్లలను అతి గారాబం చేయడంతో పాటు, ఎక్కువ క్రమశిక్షణ, నియమాలు పాటించేలా చేస్తుంటారు. ఇవి రెండూ తప్పే. వయసుతో పాటు పిల్లల ఆలోచనల్లో మార్పులు వస్తాయి. ప్రతిదీ తల్లిదండ్రులతో పంచుకోవాలని భావిస్తారు. తల్లిదండ్రులు దీనికి సిద్ధంగా ఉంటే పిల్లలు క్రమశిక్షణతో ఉంటారు.

సెల్‌ఫోన్లకు బానిసలుగా...

- దేశవ్యాప్తంగా ఒక సంస్థ ఇటీవల చేసిన సర్వేలో మన రాష్ట్రంలో ఆరో తరగతి నుంచి విద్యార్థులు ఆండ్రాయిడ్ ఫోన్‌కు బానిసలు కావడంతో చదువులు అటకెక్కుతున్నాయని వెల్లడించింది. పట్టణాల్లో 23 శాతం, పల్లెల్లో 19 శాతం విద్యార్థులు సెల్‌ఫోన్లకు టీవీలకు బానిసలయ్యారు. ముఖ్యంగా 11 నుంచి 17 సంవత్సరాల వయస్సులో ఉన్నవారు సెల్‌ఫోన్‌లో గేమ్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటికి బానిసలుగా మారినట్లు వివిధ స్వచ్ఛంద సంస్థల సర్వేల్లో తేలింది.
- పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి చదివే విద్యార్థుల్లో చాలా మందికి కనీసం పరిజ్ఞానం ఉండటం లేదు. చదవడం, రాయడంతో పాటు గణితం కూడికలు, తీసివేతలు, భాగహారం, గుణకారాలు రాని పరిస్థితి. దీనికి కారణం విద్యార్థులకు చదువుల్లో ఏకగ్రత లోపించడం. సెల్‌ఫోన్ ప్రభావంతో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు తలకెక్కడం లేదు. ఇలాంటి వారు 5 నుంచి 8 శాతం వరకు ఉన్నారని ఇటీవల విద్యాశాఖ చేపట్టిన సర్వేలో బయటపడింది.



- పిల్లల ప్రవర్తనలో తల్లిదండ్రుల పాత్ర కీలకం
- విద్యార్థుల చదువులపై దృష్టి పెట్టాలి
- ఉపాధ్యాయుల మాటకు విలువనిచ్చేలా చూడాలి
- బాల్యం నుంచే మంచి బాట పట్టించాలి..
- పెంట జెడ్పీ స్కూల్ హెచ్‌ఎంపై ప్రశంసల వర్షం

ట్యాబ్‌లను అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు..

విద్యార్థులకు సాంకేతికతను జోడించే విద్యను అందించాలని ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసింది. వాటిని విద్యాయేతర అంశాలకు, అసభ్యకరమైన చిత్రాల కోసం విద్యార్థులు నిర్భీతిగా వినియోగిస్తున్నారు. నిలదీసినా, ప్రశ్నించినా, అభ్యంతరం తెలిపినా వారినుంచి తీవ్రమైన ప్రతిఘటన ఎదురవుతోంది. తల్లిదండ్రులు సైతం వారిని వెనకేసుకొస్తున్నారు. వివాదాలు, తగాదాలు పడలేక.. చేతులు కట్టుకుని గుట్టుగా ఉద్యోగాలు చేసుకోవాల్సి వస్తోంది. విద్యార్థుల విచ్చలవిడితనానికి మేము మౌన సాక్షులుగా ఉంటున్నాం. బొబ్బిలి పట్టణంలోని ఓ పాఠశాలలో గత ఏడాది స్కూలు ఫేర్‌వెల్ ఫంక్షన్ నిర్వహణపై భేదాభిప్రాయాలు రావడంతో అక్కడి మొత్తం ఫ్యాన్లు, ఇతర పరికరాలన్నిటినీ ధ్వంసం చేశారు.

-ఓ ఉపాధ్యాయుడు

పెనుమార్పులకు శ్రీకారం..

భ్రష్టుపట్టిన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ అనేక చర్యలు తీసుకుంటున్నారు. నిపుణులు, మేధావుల నుంచి సలహాలు, సూచనలు తీసుకొని విద్యా ప్రమాణాలు పెంచడానికి గట్టిగా కృషి చేస్తున్నారు. దీని ఫలితంగా విద్యా విధానాలలో భారీ మార్పులు రావడం ఖాయం. రాష్ట్రవ్యాప్తంగా అందరినీ ఆలోచనకు గురి చేసే విధంగా హెచ్‌ఎం వ్యవహరించారు. అందుకే ఆయనను సత్కరిస్తున్నాం.

-బేబీనాయన, ఎమ్మెల్యే, బొబ్బిలి

పరివర్తన కోసం పరితపించారు..



మా ఊరు హెడ్మాస్టర్ చింతా రమణ విద్యార్థుల్లో పరివర్తన కోసం పరితపించారు. సేవా దృక్పథం కలిగిన మాస్టారుగా గుర్తింపు ఉంది. తరచూ తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెబుతూనే ఉన్నారు. కానీ తల్లిదండ్రులు పెడచెవిన పెడుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే మా తల్లిదండ్రుల్లోనే క్రమశిక్షణ తప్పింది. మేము చదువుకునే రోజుల్లో ఉపాధ్యాయులు రకరకాలుగా దండించే వారు. కేవలం చదువు కోసం మాత్రమే. తొడపాశాలు, మొట్టికాయలు, ఇసుకలో చేతితో అక్షరాలను దిద్దించడం వంటివి ఉండేవి. ఇప్పుడు అలాంటివి చేయకూడదట. కనీసం మందలించకూడదట.

-బేతనపల్లి కృష్ణమూర్తి

కుటుంబ వ్యవస్థ ప్రభావం..

కుటుంబ వ్యవస్థ ప్రభావం విద్యార్థి లోకంపై తీవ్రంగా ఉంది. చాలా మంది తల్లిదండ్రులు ఒక్కొక్కరుగా ఉండడంతో వారి పిల్లల ఆలనా పాలనా చూసే వారు లేరు. వృద్ధుల పోషణలో విద్యార్థులను ఇళ్ల వద్ద ఉంచి కొంతమంది దూరప్రాంతాలకు వలస పోతున్నారు. అలాంటి వారిలో చాలా మంది క్రమశిక్షణకు దూరంగా ఉంటారు. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో కుటుంబ సభ్యులంతా అదుపాజ్ఞలలో ఉండేవారు. నేను నిన్న చేసిన విజ్ఞాపన మంచి ఫలితాలను ఇస్తోంది. విద్యార్థులంతా మాకు మాట ఇస్తున్నారు. మేం నడుచుకుంటామని ఉపాధ్యాయ బృందానికి మాట ఇస్తున్నారు. తల్లిదండ్రులు అనేకమంది వచ్చి మా పిల్లల కోసం మీరు ఇంతలా బాధ పడుతుంటే మాకూ బాధగా ఉంది. మా పిల్లలను అదుపులో పెట్టుకోవడంలో మాకు కూడా బాధ్యత ఉందని చెబుతుంటే ఆనందంగా ఉంది.

-చింతా రమణ, హైస్కూలు హెచ్‌ఎం, పెంట

మాస్టార్లకు మాటిస్తున్నాం..



హెడ్మాస్టర్ మా కోసం గుంజీలు తీయడం చాలా బాధగా ఉంది. మేం చదువుకోకపోవడం వల్లనే సార్ ఇంతలా బాధ పడ్డారని తెలుసుకున్నాం. గతంలో ట్రిపుల్ ఐటీ సీట్లు బాగా వచ్చేవి. ఈసారి కూడా మంచి మార్కులు సాధించి.. సీట్లు కొడతాం. మా సార్‌లెవరికీ మాట పడనీయం. ఈ విషయంలో మాట ఇస్తున్నాం.

-విద్యార్థులు, జెడ్పీ ఉన్నత పాఠశాల, పెంట

ఆర్టీసీ బస్సు ఎక్కడ?

● టెన్త్ విద్యార్థుల అసంతృప్తి

భోగాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసలు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకుండా ఉచిత బస్సు సౌకర్యం ప్రకటించడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అనేక గ్రామాలకు బస్సు సౌకర్యమే లేదు. ఈనెల 17 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత బస్సు సౌకర్యం ప్రకటించింది. అసలు బస్సు లేకుండా ఉచిత బస్సు ఏంటని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. భోగాపురం మండలంలోని ముక్కాం, ముంజేరు, రామచంద్రపేట, భోగాపురం, రావాడ, పోలిపల్లి, మహరాజపేట, తూడెం, కంచేరు గ్రామాల పరిధిలో ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయం, మోడల్ స్కూల్ ఉంది. ఈ మండలం నుంచి సుమారు 887 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నారు. అయితే అన్ని హైస్కూల్స్‌కు సంబంధించి భోగాపురం హైస్కూల్, మోడల్ స్కూల్, రావాడ హైస్కూల్ మాత్రమే పరీక్షా కేంద్రాలుగా నిర్ణయించారు. ఆయా హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు మండలంలో భోగాపురం, రావాడ గ్రామాలకు వెళ్లి పరీక్ష రాయాల్సి ఉంది. అయితే మండలంలో 22 పంచాయతీలకు గానూ జాతీయ రహదారిని ఆనుకుని సవరవల్లి, పోలిపల్లి, మహరాజపేట గ్రామాలకు మాత్రమే ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. అయితే ముక్కాం, ముంజేరు, రామచంద్రపేట, రెడ్డికంచేరు, తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు సుమారు 10 కిలోమీటర్ల దూరం నుంచి భోగాపురం వచ్చి పరీక్ష రాయాలి. అలాగే మహరాజపేట, తూడెం, పోలిపల్లిలకు చెందిన విద్యార్థులు రావాడకు పరీక్షలు రాయడానికి వెళ్లాలి. అయితే మూడు పరీక్ష కేంద్రాలకు మండలంలో ఇతర గ్రామాల నుంచి ఎటువంటి బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆయా విద్యార్థులు ఆటోలు, ద్విచక్ర వాహనాలను ఆశ్రయించాల్సి ఉంది. పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానుండగా, కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ప్రకటనకు అనుగుణంగా మండలంలోని పదో తరగతి విద్యార్థులు పరీక్ష క్రేందాలకు చేరుకునేందుకు వీలుగా బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



పైడిమాంబ ఆలయంలో చండీహోమం

విజయనగరం రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సిరులతల్లి పైడితల్లి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం చండీహోమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బందితో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చండీహోమంలో పాల్గొన్నారు. హోమానికి ముందు మూడులాంతర్ల వద్ద చదురుగుడిలో పైడిమాంబకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

విజయనగరం రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టీయూ ప్రతినిధులు కె.జోగారావు, చిప్పాడ సూరిబాబు, ఎం.మురళీ కోరారు. శుక్రవారం విజయనగరం వచ్చిన విద్యా శాఖ ఆర్‌జేడీ భాస్కర్‌ను ఎస్‌టీయూ ప్రతినిధులు కలెక్టరేట్ వద్ద కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.నాగేశ్వరరావు, బంగారయ్య, పి.రాంబాబు, జీఎస్‌పీ నాయుడు, పి.రమణ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

విజయనగరం దాసన్నపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌కె టౌన్‌షిప్ ఆవరణలో జీఎంఆర్ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలలుగా కొనసాగుతున్న మోటారు వెల్డింగ్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జీఎంఆర్ సంస్థ మేనేజరు సీహెచ్ నాగరాజు ఎలక్ట్రికల్ టూల్ కిట్‌లను అందించామన్నారు. కార్యక్రమంలో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ నోడల్ అధికారి డి.సుబ్రహ్మణ్యం, సెంటర్ ఇన్‌చార్జి వెంకటరమణ పాల్గొన్నారు.

ప్యాకేజీ నిధులు.. జీతాలకు కేటాయించండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్యాకేజీ నిధులను కార్మికుల జీతాలకు కేటాయించాలని విశాఖ ఉక్కు పోరాట పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.శ్రీనివాస్, ఎ.జగన్మోహన్‌రావు, టి.రాము, హరీశ్, పాపారావు, భాస్కరరావు, శేషు, స్వామి పాల్గొన్నారు.

సాగు భూములకు హక్కులు కల్పించండి

కొత్తవలస, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సాగు భూములకు హక్కులు కల్పించాలని సీపీఎం నాయకుడు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పాత సుంకరపాలెం, కొత్త సుంకరపాలెం గ్రామాల్లో ప్రజా చైతన్యయాత్రలను నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో రైతులు 90 ఏళ్లుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి భూములపై హక్కులు కల్పించి పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు.

సత్సంగంతో ఉన్నత స్థాయికి..

రేగిడి, మార్చి 14, (ఆంధ్రజ్యోతి): సత్సంగాలతో మనిషి ఉన్నత స్థాయికి చేరుకోగలడని పలువురు ఆధ్యాత్మికవేత్తలు పేర్కొన్నారు. రేగిడిలోని దత్తపీఠంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా కిమిడి సూరపనాయుడు, రవికుమార్ ఆధ్వర్యంలో దత్త జ్ఞాన మహాసభ నిర్వహించారు. దత్త పీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

శృంగవరపుకోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మహావతార్ బాబాజీ శిష్యబృందం తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. స్వామిజీ శిష్యులు రాంబాబాజీ, లక్ష్మి మాతాజీ ఆధ్వర్యంలో పిల్లలు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఇలా చేయడం భగవంతుడికి పాదపూజ చేసినట్టవుతుందని రాంబాబాజీ అన్నారు. అనంతరం ధ్యానం గొప్పతనం, ఐశ్వర్య దీక్ష కార్యక్రమాలు నిర్వహించారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

శృంగవరపుకోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్వర్మ అన్నారు. శుక్రవారం పార్టీ నాయకుడు చిరంజీవియాదవ్ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు మరిశ శ్రీను ఆధ్వర్యంలో నూతన మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఆర్‌కె ప్రసాద్, రూపేష్, సూర్యారావు, రామకోటి, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

'శక్తి'తో మహిళల భద్రతకు భరోసా

విజయనగరం క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు ప్రభుత్వం రూపొందించిన శక్తి మొబైల్ యాప్‌ను ప్రతి మహిళ, యువత తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలో ఏర్పాటైన శక్తి టీమ్స్ ఆర్టీసీ కాంప్లెక్స్, బస్టాప్, రైల్వేస్టేషన్, ముఖ్య కూడళ్లు, కళాశాలలు సందర్శించి మహిళలు, విద్యార్థినులకు శక్తి యాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయన్నారు. మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో శక్తి యాప్ రక్షణగా నిలుస్తుందన్నారు. ఆపద సమయాల్లో సదరు మహిళలు పోలీసులకు సమాచారాన్ని అందించలేని పరిస్థితుల్లో ఈ మొబైల్ యాప్ పనిచేస్తుందన్నారు. అటువంటి సమయంలో మొబైల్ ఫోన్‌ను గాల్లో షేక్ చేసినా, వారున్న లోకేషన్, ఆడియో, వీడియో వివరాలు దగ్గరలోని పోలీసు స్టేషన్‌కు చేరుతాయన్నారు. దీంతో పోలీసులు సకాలంలో స్పందించే అవకాశం ఉంటుందన్నారు. ఎస్‌ఐలు ఆధ్వర్యంలో శక్తి టీమ్స్ మఫ్టీలో వివిధ ప్రాంతాలను సందర్శిస్తాయన్నారు. మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, యాప్ పనితీరుపై అవగాహన కల్పిస్తారని ఎస్పీ తెలిపారు.



శక్తి యాప్‌ను రిజిస్ట్రేషన్ చేయిస్తున్న మహిళా ఎస్‌ఐల బృందం

మధుపాడ రోడ్డుకు రూ.3.25 కోట్లు

గంట్యాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు తాటిపూడి- మధుపాడ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. తాటిపూడి కాలనీ నుంచి ముషిడిపల్లి, ఖండేపల్లి, మధుపాడ, కృష్ణాపురం గ్రామాలకు వెళ్లే రహదారి చాన్నాళ్లుగా అధ్వానంగా ఉంది. ఈ రోడ్డులో తాటిపూడి రిజర్వాయర్ నుంచి విశాఖపట్నం తాగునీరు సరఫరా చేసే పైపులైన్ ఉండటంతో రహదారిని బాగుచేయాలని విశాఖలోని జీవీఎంసీ అధికారులను స్థానికులు కోరారు. వారు స్పందించకపోవడంతో జీవీఎంసీ నిరసన తెలిపారు. ప్రభుత్వం మారడంతో రోడ్డు సమస్యను జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. ఆయన ఈ సమస్యను పురపాలక శాఖ మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లడంతో ఆయన స్పందించారు. 6 కిలోమీటర్ల రహదారి మరమ్మతులకు రూ.3.25 కోట్లను జీవీఎంసీ ద్వారా మంజూరు చేయించారు. దాంతో శుక్రవారం జీవీఎంసీ ఎస్‌ఈ రాజేంద్రకృష్ణ, ఈఈ మురళీకృష్ణ, డీఈ వీరయ్య రోడ్డును పరిశీలించారు. వారితో పాటు మదుపాడ టీడీపీ నాయకుడు బి.రవి ఉన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న జీవీఎంసీ అధికారులు

రైతు బజార్లలో ఆకస్మిక తనిఖీ

విజయనగరం రింగురోడ్డు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైతు బజార్లను వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎంవీ సునీత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని దాసన్నపేట, రింగురోడ్డు రైతుబజారు, తహసీల్దారు కార్యాలయం రోడ్డులోని రైతు బజారు, ఆర్‌అండ్‌బీ వద్ద రైతుబజార్లను ఆమె తనిఖీ చేశారు. రైతు బజార్లను అధునాతనంగా తయారు చేసి రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు సరసమైన ధరలో వస్తువులు లభించే విధంగా చూడాలన్నారు. రైతుబజార్లలో రైతులు, రైతు కార్డులు, డ్వాక్రా కౌంటర్లు, వ్యాపార దుకాణాలను పరిశీలించారు. బోర్డులపై సూచించిన ధరలకే కూరగాయలు అమ్మాలన్నారు. ఆమెతో పాటు జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ జి.శ్రీనివాస్ కిరణ్, అసిస్టెంట్ డైరెక్టర్ బి.రవికిరణ్, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు ఉన్నారు.



కూరగాయలను పరిశీలిస్తున్న కమిషనర్ సునీత

పైప్‌లైన్ లీక్: తాగునీటికి ఇబ్బందులు



పాడైన పైప్‌లైన్

రాజాం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన ప్రధాన పైపులైన్ లీకవుతోంది. దీంతో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ప్రధాన పైప్‌లైన్ నుంచి తాగునీరు వృథా అవుతోంది. మరమ్మతులు చేపడతామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజపతినగరం మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు బొబ్బిలి డివిజన్ ఈఈ ఎ.అనంతరావు ఓ ప్రకటనలో తెలిపారు. గజపతినగరం, ఎం.వెంకటాపురం, పురిటిపెంట, గంగచోళ్లపెంట, కొనిస, మెంటాడ తదితర ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

నేడు జిల్లా ప్రత్యేకాధికారి రాక

విజయనగరం కలెక్టరేట్ మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై పర్యవేక్షణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ నియమించిన జిల్లా ప్రత్యేక అధికారి అహ్మద్ బాబు శనివారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకాధికారి ఉదయం 10 గంటలకు జిల్లాకు చేరుకుని స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ప్రభుత్వ పథకాలు అమలు, ఆదాయ ఆర్జన శాఖల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెంపుదల, సాధించిన ప్రగతి తదితర అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

భూముల సర్వేకి ఆర్డీవో ఆదేశం

వేపాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గదవలస గ్రామానికి సంబంధించి రైతులు సాగు భూముల సర్వేకు ఆర్డీవో కీర్తి ఆదేశించారు. దాదాపు 35 ఏళ్లుగా భూములు సాగుచేస్తున్నప్పటికీ వారికి పట్టాలు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారంటూ సీపీఎం నాయకుడు చల్లా జగన్ కొద్దిరోజుల కిందట ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆమె స్పందించారు. శుక్రవారం గదవలస ఆమె విచ్చేశారు. రైతులతో మాట్లాడారు. రెవెన్యూ భూములకు, ఇనాం భూములకు వేర్వేరుగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆమె వెంట తహసీల్దార్, డీటీ ఉన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో కీర్తి

తూతూ మంత్రంగా విచారణ

శృంగవరపుకోట రూరల్ మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిశిఖర గ్రామాల్లో చిన్నారులకు సకాలంలో టీకాలు వేయకపోవడం, వారికి తట్టుతో కూడిన జ్వరాలు ప్రబలడం, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వంటి అంశాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన వరుస కథనాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎటువంటి చర్యలు తీసుకుందో ఎవ్వరికి అంతుపట్టడంలేదు. తూతూ మంత్రంగా విచారణ చేసి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు నివేదిక పంపినట్టు కనిపిస్తోంది. గిరిజన గ్రామాల్లో విష జ్వరాలపై రెండు రోజుల కిందట కొట్టాం పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సూర్యనారాయణ, డీఎల్‌ఏపీవో కె.రాణి, కొట్టాం పిహెచ్‌సీతో పాటు బొడ్డవర పరిధిలోని పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిని విచారించారు. అయితే గిరిశిఖర గ్రామాల్లో వైద్య సేవలలోపం, అందుకు కారకులపై చర్చించలేదని సమాచారం. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని, అందుకు కలిసికట్టుగా పనిచేసుకోవాలని చెప్పి వెళ్లినట్టు తెలిసింది. జాతీయ టీకా పథకం అమలును అపహాస్యం చేసిన వారి విషయాన్ని పక్కనే పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసింది. దీనికి తోడు 12 రోజుల కిందట విషజ్వరాలతో బాధపడుతున్న 13 మంది చిన్నారుల రక్తపూతలు విజయవాడ పంపించామని చెబుతున్న వైద్యులు వాటి ఫలితాలు వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

కార్యకర్త కుటుంబానికి బీమా అందజేత

కొత్తవలస/లక్కవరపుకోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని గులివిందాడ గ్రామానికి టీడీపీ కార్యకర్త మదిన పైడిరాజు గతేడాది డిసెంబరు 20న ప్రమాదవశాత్తు మృతి చెందిన నేపథ్యంలో రూ. 2 లక్షలు బీమా చెక్కును శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఆమెతో పాటు టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి కె.బి.ఎ.రాంప్రసాద్ ఉన్నారు.



చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

బాబుతోనే మహిళా సాధికారిత

గజపతినగరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే మహిళా సాధికారిత సాధ్యమని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.4,323 కోట్లు కేటాయించడం శుభపరిణామన్నారు. అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అంగన్‌వాడీలు, ఆశా వర్కర్ల సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. కార్యక్రమంలో నాయకులు పీవీవీ గోపాలరాజు, చప్పా చంద్రశేఖర్, కొండపల్లి భాస్కరనాయుడు, కోరాడ కృష్ణ, పి.అప్పలస్వామి, మక్కువ శ్రీధర్, రామ్‌కుమార్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీదేవి

ఆకట్టుకున్న గుర్రపు పందేల పోటీ



వేపాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సోంపురంలో ముత్యాలమ్మతల్లి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని రెండోరోజు శుక్రవారం సాయంత్రం గుర్రపు పందేల పోటీలు నిర్వహించారు. సింగపూరి సత్యనారాయణ మురుగన్ గుర్రం ప్రథమస్థానంలో నిలిచింది. రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

గుర్రపు పందేల దృశ్యం

మందుల నిల్వ ఇలాగేనా?

● రేకుల షెడ్డులో ఎంఎల్‌హెచ్‌పీ కేంద్రం

శృంగవరపుకోట రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లోని మందులు ఒక నిర్దిష్ట ఉష్ణోగ్రత మధ్య నిల్వ చేయాలి. అలా నిల్వ చేయని మందులు వాడితే ప్రమాదం. అయితే మండలంలోని కాపుసోంపురం ఎంఎల్‌హెచ్‌పీ కేంద్రంలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహారం సాగుతోంది. మందులు నిల్వ చేయడానికి నిర్దిష్టమైన ఏర్పాట్లేవీ ఇక్కడలేదు. ఆరుబయటే మందులు వదిలేస్తున్నారు. పైగా ఇక్కడ విధులు నిర్వహించాల్సిన సిబ్బంది రోజూ విశాఖ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అసలే ఇరుకు రేకుల షెడ్డు.. ఆపై మందులు సక్రమంగా నిల్వ చేయని తీరు రోగులను భయాందోళనకు గురిచేస్తోంది.



ఎంఎల్‌హెచ్‌పీ కేంద్రంలో మందులు ఇలా..

చికిత్స పొందుతూ యువకుడి మృతి

భోగాపురం, మార్చి14 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని అమటాంరాయవలస పంచాయతీ పరిధిలోని అమటాంకు చెందిన యువకుడు ఎ.అప్పలనాయుడు(22) శుక్రవారం మృతి చెందాడు. అప్పలనాయుడు ఓ రిసార్ట్‌లో పనిచేస్తున్నాడు. అయితే సెల్‌ఫోన్ దొంగిలించాడనే నింద అప్పలనాయుడుపై రిసార్ట్ నిర్వాహకులు వేశారు. దాన్ని అవమానంగా భావించిన అప్పలనాయుడు ఈనెల 11న గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఏటీఎం కార్డుల క్లోనింగ్: ఇద్దరు అరెస్టు

పాలకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డులను క్లోనింగ్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్న మహరాష్ట్రకు చెందిన ఇద్దరు యువకులను పాలకొండ పోలీసులు చాకచక్యంగా పట్టుకు, అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం పాలకొండ డిఎస్పీ రాంబాబు వివరించారు. ముంబైకి చెందిన విజయ్ ద్వివేది, అఫ్సర్‌ఖాన్ అనే ఇద్దరు నేరగాళ్లు రాష్ట్ర వ్యాప్తంగా ఏటీ ఎం కార్డు క్లోనింగ్ చేస్తూ వృద్ధులు, నిరక్షరాస్యులే ప్రధాన లక్ష్యంగా మోసం చే యడం వీరి నేర ప్రవృత్తి అని తెలిపారు. ఈ ఏడాది జనవరి 17వ తేదీన థామస్ అనే వ్యక్తి వద్ద నుంచి ఏటీఎం కార్డు మార్చి ఆయన అకౌంట్‌లో నగదు విత్‌డ్రా చేసినట్టు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశామని చెప్పారు. ముంబైకి చెందిన ఇద్దరు క్రిమినల్స్ పాలకొండలో మరోసారి నేరం చేసేందుకు వచ్చినప్పుడు పట్టుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి రూ. 4.10 లక్షల నగదు, స్విఫ్ట్ కారు, రెండు మొబైల్ ఫోన్లతో పాటు నేరానికి పాల్పడేందుకు వినియోగించే 78 ఏటీఎం కార్డులను రికవరీ చేశామని ఆయన చెప్పారు. సీఐ చంద్రమౌళి, ఎస్ఐ దక్షిణామూర్తి ఉన్నారు.



నిందితులతో డీఎస్పీ రాంబాబు

150 పశువుల స్వాధీనం

కొత్తవలస, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కొత్తవలస, సబ్బవరంలో పశువుల అక్రమ రవాణాపై అనకాపల్లి జిల్లా సబ్బవరం, విజయనగరానికి చెందిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కొత్తవలస పోలీసులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. రవాణాకు సిద్ధంగా ఉంచిన 150 పశువులను పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వాహనాలను సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వ్యాపారులు పరారయ్యారు. ఘటనపై కేసు నమోదు చేస్తామని సీఐ షణ్ముఖరావు తెలిపారు.

రెండు వ్యాన్లు సీజ్..

● దత్తిరాజేరు: పశువులను అక్రమంగా తరలిస్తున్న 2 బొలేరో వ్యాన్లను శుక్రవారం సీజ్ చేసినట్టు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేశ్ తెలిపారు. మండలంలోని మరాడాం సమీపంలో 17 పశువులను 2 బొలేరో వ్యాన్లలో తరలిస్తున్న సమయంలో పట్టుకున్నామన్నారు. ఒడిశా నుంచి పెదమానాపురం సంతకు ఈ పశువులను తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. రెండు వ్యాన్లను సీజ్ చేసి పశువులను గోశాలకు తరలించినట్టు తెలిపారు.

'ఎన్టీఆర్ వైద్యసేవ'ను ప్రక్షాళన చేయండి

మెంటాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలో జరుగుతున్న అవినీతి నిగ్గు తేల్చేందుకు కలెక్టర్ అంబేడ్కర్ చొరవ తీసుకోవాలని సీపీఎం మెంటాడ మండల కార్యదర్శి రాకోటి రాములు కోరారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్యసేవ విభాగం మొదటి నుంచీ అక్రమాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. కిందస్థాయి నుంచి పైస్థాయి వరకూ అంతటా అవినీతి చోటు చేసుకుందని విమర్శించారు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటివరకు దీనిపై దృష్టి సారించకపోవడం విచారకరమన్నారు. త్వరలోనే కలెక్టర్‌ను కలసి అవినీతి బాగోతంపై వినతిపత్రం అందజేస్తామన్నారు. తక్షణమే ఎన్టీఆర్ వైద్యసేవ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని రాములు అభిప్రాయపడ్డారు.

వినూత్నంగా విద్యార్థుల నిరసన

గరివిడి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులు శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. తమకు స్టైఫండ్ పెంచాలని, చదువులకు బీసీఏ అనుమతి తదితర అంశాలపై 40 రోజుల నుంచి తరగతులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోవడంతో శుక్రవారం గరివిడి, చీపురుపల్లి ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న కళాశాల ముఖద్వారం వద్ద హోలీ పండగలో భాగంగా రంగులు పూసుకుని నిరసన వ్యక్తం చేశారు.



రంగులు పూసుకుని విద్యార్థుల నిరసన

ఆస్తులను కాపాడే బాధ్యత మీది కాదా..?

బొండపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత గ్రామస్థాయి అధికారులపై లేదా అని ఈవోపీఆర్‌డీ రఘుపతిరావును పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వెదురువాడలో చెరువు గట్టుపై మునగ చెట్ల ఆదాయానికి అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి గండికొట్టారని సర్పంచ్ కిలా పైడిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు మోపాడ సత్యవతి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి వి.సింహాచలంకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో గిరిబాల స్పందిస్తూ కార్యదర్శికి మెమోను జారీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, ప్రోటోకాల్ పాటించక పోవడం తదితర వాటిపై అధికారులను సభ్యులు నిలదీశారు. సమావేశంలో తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ

బెడ్లు 150.. రోగులు 249



జిల్లా కేంద్రాసుపత్రిలో అధ్వానంగా ఉన్న బెడ్

(5వ పేజీ తరువాయి)

● వీల్ ఛైర్లు ఉన్నా అవసరమైన రోగులకు అందించడం లేదు.

● ఫోరెన్సిక్, మైక్రో బయోలజిస్ట్, సైకార్డియాజిస్ట్ తదితర పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఐదుగురు లాబ్ టెక్నీషియన్లు , 43 మంది స్టాఫ్ నర్సులు ఉన్నారు.

● గుండె సంబంధిత వైద్య నిపుణులు లేకపోవడంతో రోగులు పొరుగు జిల్లాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది.

సిబ్బంది నిర్లక్ష్యం

ఏదో గుర్తుతెలియని క్రిమికీటకం కుట్టడంతో అర్ధరాత్రి ఆసుపత్రికి వచ్చాను. వెంటనే చికిత్స అందించారు. ఉదయం డాక్టర్ పరీక్షించి డిశ్చార్జ్ చేసేస్తామన్నారు. అయితే డాక్టర్ వెళ్లి చాలా సమయమైనా డిశ్చార్జ్ చేయలేదు. దీనిపై వైద్య సిబ్బందిని అడిగితే పట్టించుకోలేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

- మడ్డి భాస్కర్, కొత్తపట్నం

కిడ్నీ సమస్యతో వచ్చా...

కిడ్నీ సమస్యతో వచ్చా. డయాలసిస్ చికిత్స అందిస్తున్నారు. వారానికి మూడు సార్లు డయాలసిస్ చేయాలని వైద్యులు చెప్పారు. అందుకే సోమవారం వచ్చి ఆసుపత్రిలోనే ఉంటున్నాను. ఇక్కడ వైద్యం బాగానే అందిస్తున్నారు.

- ఎం.కృష్ణ, అంటివలస

ఇంకా కోలుకోలేదు..

కాళ్లు వాపులు, కడుపు ఉబ్బరం సమస్యతో ఆసుపత్రిలో రెండు రోజుల కిందట చేరాను. అంతకముందు గుమ్మలక్ష్మీపురం ఆసుపత్రికి వెళ్లాను. వాళ్లు జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. ఇంకా పూర్తి స్థాయిలో కోలుకోలేదు.

- బిడ్డిక శివకుమార్, దర్శిగూడె

సిబ్బంది కొరత వాస్తవమే..

ఆసుపత్రిలో 150 బెడ్‌లకు సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు. రోజూ 200 మందికి పైగా రోగులు ఆసుపత్రిలో ఉంటారు. వారికి సేవలందించేందుకు సరిపడా సిబ్బంది అయితే లేరు. ఇప్పుడు మలేరియా, సీజనల్ వ్యాధిగ్రస్థులు ఎక్కువగా లేరు. వైరల్ ఫీవర్స్‌తో అత్యధికులు చేరుతున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే మెరుగైన వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుంది.

- కె.శ్యామల, ఆర్ఎంవో, జిల్లా కేంద్రాసుపత్రి

ఆపద వేళ.. 'శక్తి'నిచ్చేలా!



శక్తి టీం వాహనాలు

(5వ పేజీ తరువాయి)

అభద్రతాభావంతో చెప్పుకోలేని కొన్ని ఫిర్యాదులను మహిళా పోలీసులకు చెప్పుకునేందుకు అవకాశం కలుగుతుంది.

పాఠశాల, కళాశాలలో డ్రాప్‌బాక్స్‌లు

మహిళల చిత్రాలను మార్ఫింగ్ చేసి.. వారి వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టి.. బాధితులను బెదిరించి సొమ్ము చేసుకునే నేరాలు పెరిగిపోయాయి. విద్యార్థినుల భద్రతలో భాగంగా ప్రతీ పాఠశాల, కళాశాలలో పోలీసులు 'సంకల్పం' పేరిట 'డ్రాప్‌బాక్స్'లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా బాధిత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు. శక్తి బృందం, సమీప స్టేషన్ సిబ్బంది వాటిని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతారు. వాటిని నేరుగా ఎస్పీ పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు.

రంగంలోకి శక్తి టీం వాహనాలు

బెలగాం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మహిళల రక్షణకు శక్తి టీములను ఏర్పాటు చేశామని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం శక్తి టీం వాహనాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఒక్కో టీమునకు ఐదుగురు చొప్పున 15 మందితో మూడు బృందాలను ఏర్పాటు చేశాం. ఈ బృందంలో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది ఉంటారు. జిల్లా కేంద్రంలో ఒకటి, పాలకొండలో ఒకటి, సాలూరులో ఒకటి చొప్పున టీములుంటాయి. ఇప్పటికే డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేశాం. ఒక్కో వాహనానికి ఏఎస్ఐ నాయకత్వం వహిస్తారు. కళాశాలలు, ముఖ్య కూడళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాలలో ఈ టీంలు సంచరిస్తూ మహిళలకు రక్షణగా ఉంటాయి. ఆపద సమయంలో మహిళలు ఘటనా స్థలం నుంచి 112 లేదా 100 నెంబర్‌కు ఫోన్ చేసినా, శక్తి యాప్ ద్వారా మెసేజ్ ఇచ్చినా.. వెంటనే ఈ టీం అక్కడకు చేరుకుంటుంది.' అని తెలిపారు. శక్తి యాప్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, వారి మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత సురానా, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఆర్ఐలు నాయుడు, రాంబాబు, శక్తి టీమ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఇంజనీర్లపై విచారణ

సీతంపేట రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 20 సబ్‌ప్లాన్ మండలాల్లో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన రహదారి పనులపై ఇటీవల విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపారు. దీంతో ప్రభుత్వం.. సీతంపేట ఈఈగా పనిచేసి రిటైర్ అయిన పి.అశోక్, పాతపట్నం డివిజన్‌లో టీడబ్ల్యూ ఇంజనీరింగ్ డీఈగా పనిచేసి పదవీ విరమణ పొందిన బి.దేశాయ్‌పై విచారణకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది.

ఘనంగా గణపతి ఆలయ ప్రారంభోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

మక్కువ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చెముడు గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ సరస్వతి సహిత వరద గణపతి ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా శుక్రవారం పూర్ణకలశ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వినాయక విగ్రహాలకు తిరువీధి నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు.

అర్థలి రోడ్డుకు మోక్షం

పాలకొండ,మార్చి 14(ఆంధ్రజ్యోతి): సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న అర్థలి గ్రామానికి పక్కా రహదారి నిర్మాణం పూర్తయింది. 70 ఏళ్లుగా సరైన రహదారి లేక గ్రామస్థులు నానా అవస్థలు పడ్డారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కృషితో వారి కల నెరవేరింది. దీంతో వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా డోలోత్సవం

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు



బొబ్బిలి: వేణుగోపాలస్వామి ఆలయం వద్ద భక్తులు, ఇన్‌సెట్‌లో మండపంలో కొలువుతీరిన స్వామివారు



నెల్లిమర్ల: రామతీర్థంలో డోలోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పార్వతీపురంటౌన్: పూజలందుకుంటున్న నృసింహస్వామి



భామిని: లివిరిలో కామ దహనం

నెల్లిమర్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని డోలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరామచంద్ర స్వామిని పల్లకిలో తిరువీధి ఉత్సవం చేపట్టారు. కొండమెట్ల వద్ద డోలా మండపం వద్దకు తీసుకు వెళ్లి రామచంద్రస్వామివారిని ఉయ్యాలలో వేంచేపు చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు. ● పార్వతీపురంటౌన్: పట్టణంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం డోలాయాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు చేశారు. ● బొబ్బిలి: పట్టణంలో శుక్రవారం రాత్రి డోలాయాత్ర వైభవంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం నుంచి మేళతాళాలతో స్వామివారి ఉత్సవ విగ్రహాలను పూల్‌బాగ్‌లో గల డోలా యాత్ర మండపానికి తీసుకువెళ్లారు. రోజంతా పూజలు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ప్రతినిధి బేబీనాయన ఈ ఉత్సవాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాద వితరణ చేశారు. రాత్రి స్వామివారిని తిరిగి ఆలయానికి తరలించారు. ● భామిని: మండలంలోని ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో గల లివిరి గోపినాథ రాధాకృష్ణ ఆలయం వద్ద డోలోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేసి, కామ దహనం చేపట్టారు.

పింఛన్ రూ.4వేలకు పెంచిన ఘనత బాబుదే

● మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌ను రూ.2వేలు నుంచి రూ.4 వేలుకు పెంచిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం సాలూరులోని తన నివాసంలో ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యంతో రూ.3లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. గిరిజన సంక్షేమ శాఖకు రూ.8వేల కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు రూ.4వేల కోట్లు కేటాయించటం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వం మధ్యలో నిలిపివేసిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఎస్టీలకు రూ.75వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు అదనంగా పెంచి ఇస్తామని చెప్పారు. సోలార్ విద్యుత్, గాలి ద్వారా తయారు చేసే విద్యుత్‌ను ప్రోత్సహించిన మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. పాఠశాలలు ప్రారంభం అయిన వెంటనే ఎంతమంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం వస్తుందని అన్నారు. మే నెలలో ప్రతి రైతుకు డబ్బులు జమ అవుతాయని తెలిపారు. మార్చి నెలాఖరులోగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), డబ్బి కృష్ణ, మక్కువ మండల అధ్యక్షుడు గుళ్ల వేణు, పరమేష్‌తో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల రూట్ల సంఖ్య పెంచాలి

పాలకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాలో ఆర్టీసీ బస్సుల రూట్ల సంఖ్య పెంచాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ పి.భానుమూర్తి.. మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కోరారు. శుక్రవారం సాలూరులో ని తన నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి, పలు సమస్యలను వివరించారు. గత మూడేళ్ల కిందట చీపురుపల్లి బ్రిడ్జి రిపేరుతో బస్సులు నిలుపుదల చేశామని దీంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. తక్షణమే చీపురుపల్లి బ్రిడ్జ్‌ను ప్రారంభించేందుకు తగు నిర్ణయాలు అసెంబ్లీలో చేయాలని కోరారు. ఆర్టీసీ బస్సులను బ్రిడ్జి మీద నుంచి వెళ్లేందుకు అనుమతి ఇప్పించాలని మంత్రిని కోరారు. ఇప్పటికే పాలకొండ, విజయనగరం బస్ డిపోలకు తీరని నష్టం వస్తుందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత శాఖా మంత్రి, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఆమె హామీ ఇచ్చినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జోనల్ సెక్రటరీ భానురు కృష్ణమూర్తి, విజయనగరం జిల్లా సెక్రటరీ జి.రవికాంత్, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రావు పాల్గొన్నారు.

నేడు వినియోగదారుల సదస్సు

గరుగుబిల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం వినియోగదారుల సదస్సును నిర్వహిస్తామని వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు, ప్రధాన కార్యదర్శి మాన్యం రామకృష్ణ తెలిపారు. శుక్రవారం వీరు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ సదస్సుకు డీఈవో తిరుపతినాయుడు తోపాటు డీఎంహెచ్‌వో తదితరులను ఆహ్వానించామని చెప్పారు. ఈ సమావేశంలో వినియోగదారుల ఫోరం ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పిన్నింటి ఈశ్వరరావు, నల్ల మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర

పాచిపెంట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిర్వాసిత గ్రామాలైన మడవలస, తురాయిపాడులో శుక్రవారం సీపీఎం ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ మడవలస, తురాయిపాడు గ్రామాల్లో 46 గిరిజన కుటుంబాలు ఉన్నాయని, ఒక్కొక్క కుటుంబానికి రెండు ఎకరాలు చొప్పున పట్టాలిచ్చి నేటికీ భూమి చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దగెడ్డ ప్రాజెక్టు నిర్మాణం వల్ల గిరిజనులు సర్వం కోల్పోయి ఎటువంటి ఉపాధి లేక కష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇచ్చిన పట్టాలు ప్రకారం భూమి చూపించాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్వాసితుల మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు, రక్షణ పరికరాలు రాయితీపై ప్రభుత్వం కల్పించాలని కోరారు. ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, నిర్వాసితులు పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం సభ్యులుగా చేరాలి

పాలకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న ఏపీ రైతు సంఘంలో సభ్యులుగా చేరాలని సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం కొండాపురం గ్రామంలో సంఘం సభ్యత్వ శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా ఏపీ రైతు సంఘం పనిచేస్తుందని, అలాంటి సంఘంలో రైతులు సభ్యులుగా చేరాలని సూచించారు. ఈ శిబిరంలో కిమిడి రామ్మూర్తినాయుడు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మజ్జి సన్యాసినాయుడు, పారినాయుడు, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె



సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సాలూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ కార్మికులు నిర్వహించిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరింది. ఈ శిబిరంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు ఎన్‌వై నాయుడు తోపాటు పలువురు మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోర్కెలను తక్షణం తీర్చాలని డిమాండ్ చేశారు. కార్మికులను ప్రతినెలా ఒకటో తేదీ నాటికి జీతాలు వచ్చేలా చూడాలన్నారు. సబ్బులు, నునె ఇవ్వాలని కోరారు. ఈ శిబిరంలో పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సారా నియంత్రణకు సహకరించండి

జియ్యమ్మవలస, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సారా నియంత్రణకు ప్రజలంతా సహకరించాలని పోలీసులు కోరారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని గడసింగుపురం, అర్నాడ, చినబుడ్డిడి గ్రామాలకు గజపతినగరం ఎస్ఐ పి.నరేంద్రను, పెదతుంబలి, శిఖబడి, కేటీ వాడ గ్రామాలకు బొబ్బిలి ఎస్ఐ ఎ.శ్రావణ్‌కుమార్‌లను దత్తత అధికారులుగా నియమించారు. వీరి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయా గ్రామాల్లో ర్యాలీలు, సారా వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్ సిబ్బంది, కురుపాం ఎక్సైజ్‌శాఖ కానిస్టేబుల్ వై.కొండలరావు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బొబ్బిలి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ సీఐ పామోటి చిన్నంనాయుడు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద సీఐ తన సిబ్బందితో పోస్టర్లను అతికించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే విజయచంద్ర



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం అసెంబ్లీ నుంచి వచ్చిన ఆయన.. నర్సిపురంలోగల తన క్యాంపు కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను విన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బాధితులకు భరోసా ఇచ్చారు.

న్యూస్ బాక్స్

పది విద్యార్థులకు అవగాహన

గరుగుబిల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామని ఎంఈవో దత్తి అప్పలనాయుడు తెలిపారు. రావివలసలోని కేజీబీవీని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. విద్యార్థులు పరీక్షా సమయంలో ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు.

గడ్డివాము దగ్ధం

పాలకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పద్మాపురం గ్రామానికి చెందిన ఆలుబెల్లి చంద్రశేఖరరావుకు చెందిన గడ్డికుప్ప అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. శుక్రవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఎకరా విస్తీర్ణానికి చెందిన వరిపంట నుంచి నూర్పి పశువుల దాణా కోసం నిల్వ ఉంచిన గడ్డికుప్ప అగ్నికి ఆహుతయ్యింది. గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు పాలకొండ అగ్నిమాపక సిబ్బంది హాజరై మంటలను అదుపుచేశారు.

లేగ దూడలకు టీకాలు

సీతంపేట రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): లేగ దూడలకు బ్రుసిల్లా వ్యాధి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా టీకాలు వేస్తున్నామని పశు సంవర్థక శాఖ ఏడీ శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం సీతంపేట గ్రామంలో లేగ దూడలకు టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. బ్రుసిల్లా వ్యాధి రాకుండా 4 నెలల నుంచి 8 నెలల ఆడ లేగ దూడలకు ఈ టీకాలు వేస్తున్నామని చెప్పారు.

ఒడిశా

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బాలిక బలి

రాయగడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఓ బాలిక బలైన ఘటన రాయగడ జిల్లాలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయగడ జిల్లాలోని రామన్నగుడ సమితి పరికిత్రి పంచాయతీ గణపతిగుడ గ్రామానికి చెందిన నైనాసాహు(16) అనే పదో తరగతి విద్యార్థిని.. ఈనెల 6వ తేదీతో పరీక్షలు పూర్తయిన తర్వాత ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌కు బానిసగా మారింది. తల్లిదండ్రులు ఎంత మందలించినా అలవాటును మానుకోలేకపోయింది. ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న క్రమంలో గెలవడం, ఓడడం జరుగుతుండేది. చివరికి బుధవారం రూ.4లక్షలు గెలిచినట్టు నైనా సాహూకు యాప్ నిర్వాహకుల ద్వారా సమాచారం అందింది. తాను గెలిచిన నాలుగు లక్షలు తన అకౌంట్లో జమ కాకపోవడంతో నిర్వాహకులను నిలదీసింది. వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో మనస్తాపానికి గురై అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉదయం తల్లిదండ్రులు చూసి లబోదిబోమన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి దర్శనానికి వచ్చి అనంతలోకాలకు

● నాగావళి నదిలో బాలుడి మృతి

రాయగడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాయగడ మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన సాయికృష్ణ (17) బంధువులతో కలిసి శుక్రవారం మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి వచ్చాడు. అమ్మవారి దర్శనం చేసుకున్న తర్వాత సమీపంలోని నిషేధిత ప్రాంతం నాగావళి నదిపై ఉన్న తీగవంతెన అందాలను చూడడానికి వెళ్లారు. అక్కడ అందరూ కలిసి నదిలో స్నానానికి దిగారు. ఈ సమయంలో తన మేనమామ కొడుకు నదిలో మునిగిపోతుండాన్ని సాయికృష్ణ చూశాడు. రక్షించేందుకని వెంటనే నదిలో దిగగా ప్రమదవశాత్తు మునిగిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. సాయికృష్ణని బయటకు తీసి, జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. సాయికృష్ణ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. సాయకృష్ణ విజయవాడకు చెందిన పి.మురళీ కుమారుడిగా పోలీసులు తెలిపారు.

ఉగాది వేడుకలకు శుభరాట



పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాయగడలో ఈనెల 30న జరగనున్న ఉగాది వేడుకలకు శుక్రవారం స్థానిక కొల్లిగుడ సమీపంలో శుభరాట వేశారు. ఈ పూజా కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపిఆనంద్, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు ఎల్లా వెంకటేశ్వరరావు(కొండబాబు), కాశీనాయుడు, దొడ్ల లక్ష్మణరావు, వివిధ సంఘాల మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.